అక్రమ నిర్మాణంపై హైడ్రాకు ఫిర్యాదు

ముషీరాబాద్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి) : భోలక్‌పూర్ డివిజన్ కవాడిగూడ తాళ్ళబస్తీ కమ్యూనిటీహాల్ ఎదురుగా రోడ్డును ఆక్రమించి నిర్మించిన అక్రమ నిర్మాణాన్ని కూల్చివేయాలని స్థానికుడు చంద్రప్రకాష్ హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. శనివారం విలేకరుల సమావేశంలో చంద్రప్రకాష్ మాట్లాడుతూ అక్రమ నిర్మాణంపై హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేశానని అందుకు సంబంధించిన ఫొటోలను అందజేశానని తెలిపారు. ఫుట్‌పాత్ ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడం వల్ల ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. ఈ అక్రమ నిర్మాణాలపై జీహెచ్‌ఎంసీ అధికారులకు సైతం ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రజలకు ఇబ్బందికరంగా ఉన్న అక్రమ కట్టడాలను తొలగించాలని కోరారు. ఇప్పటికైనా హైడ్రా కమిషన్ ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

బీసీ రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చాలి


ర్యాలీ నిర్వహిస్తున్న రాజేందర్ పటేల్‌గౌడ్

బర్కత్‌పుర, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థలలో కల్పించిన 42శాతం రిజర్వేషన్లను రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం కాచిగూడ నింబోలిఅడ్డలో బీసీ నేతలతో కలిసి నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు 42శాతం రిజర్వేషన్లను అమలు చేసిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్లు లేకుండా ఎన్నికలకు వెళ్తే బీసీల సత్తా ఏమిటో చూపిస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్, కేంద్రంలోని బీజేపీ పార్టీలకు బీసీలంతా తగిన గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలో ఉన్నాయన్నారు. బీసీల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బి.కృష్ణ, భూషణ్‌భాస్కర్, ముత్యాల్‌రావు, డాక్టర్ ప్రశాంత్ నిమ్‌కర్, కిషోర్‌గౌడ్, సత్యపాల్‌సింగ్, ప్రదీప్‌గౌడ్ పాల్గొన్నారు.


నూతన కార్యవర్గానికి నియామక పత్రం అందజేస్తున్న ఎం.భాగ్యలక్ష్మి

కార్మికుల పరిరక్షణకు కృషి : భాగ్యలక్ష్మి

బర్కత్‌పుర, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతా మజ్దూర్ సెల్ కార్మికుల పరిరక్షణకు కృషి చేస్తుందని ఆ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.భాగ్యలక్ష్మి తెలిపారు. శనివారం కాచిగూడలోని సంఘం కార్యాలయంలో నూతన కమిటీని ఆమె ప్రకటించారు. ప్రధాన కార్యదర్శులుగా బి.లలిత, అల్వాల్ సువర్ణ, ఉపాధ్యక్షురాలిగా సోని, కార్యదర్శులుగా శోభాదేవి, తిరుమల మణిభోల, రజిత, శ్రీనిధి, కోశాధికారిగా అరుణ, రేణుక, ఉమ, ఐటీసెల్ ప్రతినిధిగా జ్యోతి తదితరులను ప్రకటించారు. మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్మిక సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు.

నాగదేవత ఆలయంలో పూజలు


పూజల్లో బీజేపీ నేత వినయ్‌కుమార్ తదితరులు

చిక్కడపల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి వివేక్‌నగర్‌లోని పీపుల్స్‌పార్క్‌లో గల నాగదేవత రేణుకా ఎల్లమ్మ ఆలయాన్ని శనివారం బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్‌కుమార్ సందర్శించారు. నాగులచవితి సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేత పి. నర్సింగ్‌రావు, ఆలయ పూజారి శ్రీనివాస్, జ్యోతి, చంద్రశేఖరశర్మ తదితరులు పాల్గొన్నారు.

శివుడికి అభిషేకాలు

చిక్కడపల్లి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): వివేక్‌నగర్‌లోని ఆంజనేయ స్వామి ఆలయంలో కార్తీకమాస ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఆలయం ఆవరణలోని శివాలయంలో శనివారం శివుడికి ఆలయ పూజారులు, వేద పండితులు ప్రత్యేక అభిషేకాలు, క్షీరాభిషేకాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు శివపురాణం ప్రవచనం చేశారు. ఈవో మాచర్ల దేవనాథం, ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ జానకి సుధాకర్ ఆలయ కమిటీ సభ్యులు శ్యాంముదిరాజ్, శిశుకుమార్, పద్మావతి తదితరులు పాల్గొన్నారు. కాగా ఆర్టీసీ క్రాస్‌రోడ్డు లక్ష్మీగణపతి ఆలయంలో నాగుల చవితి సందర్భంగా నాగదేవతకు ప్రత్యేకపూజలు నిర్వహించారు.

బాలరత్న అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

చిక్కడపల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవం సందర్భంగా తమ సంస్థ ప్రదానం చేసే బాలరత్న అవార్డుల కోసం వివిధ రంగాల్లో ప్రతిభ చూపుతున్న బాలల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కమలాకర మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్, కమలాకర సంగీత నృత్య కళాక్షేత్రం నిర్వాహకులు భారతికమలాకర్ తెలిపారు. 15 సంవత్సరాలలోపు చిన్నారులకు ఈ అవార్డులు అందజేస్తామన్నారు. నవంబర్ 13న జరుగనున్న అవార్డుల ప్రదాన కార్యక్రమం సందర్భంగా ఆసక్తి గల చిన్నారులు తమ దరఖాస్తులను నవంబర్ 10వ తేదీ లోగా పంపాలని కోరారు. మరిన్ని వివరాల కోసం 7675955208, 8309281780 (వాట్సాప్), 8639574095(రంగనాథ్) నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి : జైసింహ

ముషీరాబాద్, అక్టోబర్ 25(ఆంధ్రజ్యోతి) : ముషీరాబాద్ నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ నేతలు అంకితభావంతో పనిచేయాలని బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ అన్నారు. శనివారం మీడియా సెల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, నియోజకవర్గానికి చెందిన ఆ పార్టీ సీనియర్ నాయకులు పి. శ్రీధర్‌చారి, రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు శంకర్ ముదిరాజ్, కరికె కిరణ్‌లు ముఠా జైసింహను కలిసి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో చేపడుతున్న కార్యక్రమాలు, ముషీరాబాద్ నియోజకవర్గంలో ప్రజా సమస్యలను వివరించి జైసింహను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో మాగంటి సునీత గెలుపు లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ, కృపాకర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పి.సాయిబాబా తదితరులు

మంత్రుల ధనదాహం వల్లే అధికారుల రాజీనామాలు

● టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు సాయిబాబా

రాంనగర్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి) : మంత్రుల ధనదాహం వల్లనే అధికారులు పదవులకు రాజీనామా చేస్తున్నారని, దీనిని నియంత్రించాల్సిన బాధ్యత సీఎంపై ఉందని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు పి.సాయిబాబా పేర్కొన్నారు. శనివారం ఆ పార్టీ నగర కార్యాలయంలో సమావేశంలో ఆయన మాట్లాడారు. మేడారం జాతర టెండర్ల వల్లనే మంత్రి కొండా సురేఖ, శ్రీనివాస్‌రెడ్డిల మధ్య వివాదం తలెత్తిందన్నారు. ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు వాటాల పంపిణీ విషయంలో ఐఏఎస్ అధికారి రిజ్వీ ఒప్పుకోకపోవడం వల్లనే మంత్రి లేఖ రాయడంతో ఆయన మనస్తాపానికి గురై పదవికి రాజీనామా చేశారని అన్నారు. ఇలాంటి ఘటనలు ప్రభుత్వానికి, ప్రజలకు మంచిగా జరగకూడదన్నారు. ప్రభుత్వ సొమ్మును కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నల్లెల కిషోర్, పి.బాల్‌రాజ్‌గౌడ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ముషీరాబాద్, అంబర్‌పేటలో మోస్తరు వర్షం

ఇబ్బందిపడ్డ జనజీవనం


ముషీరాబాద్‌లో కురుస్తున్న వర్షం


చిక్కడపల్లిలో కురుస్తున్న వర్షం దృశ్యం


ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో నిలిచిన వర్షం నీరు

రాంనగర్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి) : ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాలలో శనివారం మధ్యాహ్నం మోస్తరు వర్షం కురిసింది. దీంతో జనజీవనం ఇబ్బంది పడ్డారు. మధ్యాహ్నం 2గంటల సమయంలో కురిసిన వర్షం వల్ల లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచింది. వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. సాయంత్రం కూడా స్వల్పంగా వర్షం పడడంతో ఇంటికి వెళ్లే ఉద్యోగులు ఇక్కట్లకు గురయ్యారు.

ముషీరాబాద్ : ముషీరాబాద్‌లో శనివారం భారీ వర్షం కురిసింది. రోడ్లపై నీళ్ల నిలిచిపోవడం వల్ల ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. పార్శిగుట్ట, బాపూజీనగర్, వినోబా నగర్ తదితర ప్రాంతాల్లో వర్షంనీరు పెద్ద ఎత్తున ప్రవహించాయి. ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో వర్షం నీరు భారీగా నిలిచిపోవడం వల్ల విద్యార్థులకు ఇబ్బందికరంగా మారింది.

బీఆర్ఎస్ ముషీరాబాద్ నేతలకు హరీష్‌రావు ఫోన్లు

● జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలపై వివరాల సేకరణ


బీఆర్ఎస్ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం చేస్తున్న శ్రీధర్‌చారి, శ్రీధర్‌రెడ్డి తదితరులు

ముషీరాబాద్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి) : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గెలుపుకోసం కష్టపడి పనిచేయాలని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే టి. హరీష్‌రావు, ముషీరాబాద్ నియోజకవర్గ పార్టీ నేతలకు ఫోన్లు చేసి కోరుతున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పార్టీ యువ నాయకుడు ముఠా జైసింహ ఆధ్వర్యంలో షేక్‌పేట్ డివిజన్‌లో పార్టీ అభ్యర్థి మాగంటి సునీతకు మద్దతుగా నియోజకవర్గానికి చెందిన నేతలు ప్రచారం చేస్తుండడంతో శనివారం నియోజకవర్గానికి చెందిన భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై. శ్రీనివాస్‌రావు, సీనియర్ నాయకులు దీన్‌దయాల్‌రెడ్డి, శివముదిరాజ్, కార్తీక్‌రెడ్డి తదితరులకు హరీష్‌రావు ఫోన్లు చేసి మాట్లాడారు. జూబ్లీహిల్స్‌లో ఓటర్లు ఏమంటున్నారు. ప్రతి పోలింగ్‌బూత్‌లో ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి వారి మద్దతును కూడగట్టాలని సూచించారు. ప్రతి రోజు మీరు ఏవిధంగా పనిచేస్తున్నారు. ఎవరు ఎవరు చేయడం లేదు అనే సమాచారం నా వద్ద ఉందని వారికి సూచించారు. ప్రతిరోజు మీకు కేటాయించిన పోలింగ్‌బూత్‌లలో కష్టపడి పనిచేసి మాగంటి సునీతను గెలిపించాలని అప్పుడే మీ పనితీరు బయటపడుతుందన్నారు. రెండు రోజుల్లో మళ్లీ ఫోన్ చేస్తాను సమగ్ర నివేదిక ఇవ్వాలని సూచించారు. పోలింగ్‌బూత్‌లో ఎంతమంది ఓటర్లను కలిశారు. ఎంతమంది ఉన్నారు. వారి మద్దతు ఎలా ఉంది. నివేదికను ఇవ్వాలని ఆయన కోరారు.


బీఆర్ఎస్ రాష్ట్ర యువనేత ముఠా జైసింహ పుట్టినరోజు వేడుకలు గాంధీనగర్ డివిజన్‌లో ఘనంగా జరిగాయి. బీఆర్ఎస్ ముషీరాబాద్ నియోజకవర్గ మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్‌తోపాటు శంకర్‌ముదిరాజ్, శ్రీధర్‌చారి, కరికే కిరణ్, రామకృష్ణముదిరాజ్‌లు ముఠా జైసింహను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. - చిక్కడపల్లి, ఆంధ్రజ్యోతి


బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ పుట్టినరోజ సందర్భంగా ఆయనను ఆ పార్టీ సీనియర్‌నేత బీఎన్ శ్రీనివాస్‌యాదవ్ అభినందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు పాశం రవి, వై. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. - చిక్కడపల్లి, ఆంధ్రజ్యోతి

జనాభా ప్రకారం రిజర్వేషన్లకు రాజ్యాంగ సవరణ చేయాలి

● రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య


మాట్లాడుతున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య

రాంనగర్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి) : జనాభా ప్రకారం రిజర్వేషన్లకు రాజ్యాంగ సవరణ చేయాలని, ఇందుకు అన్ని పార్టీలు ఏకాభిప్రాయంతో రావాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య సూచించారు. శనివారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శులు కె.ప్రవీణ్‌గౌడ్, బానాల అజయ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రిజర్వేషన్ల సమస్యకు ప్రతిసారి వ్యతిరేక తీర్పులు వస్తున్నాయని, దీనికి రాజ్యాంగ భద్రత కల్పించడమే శాశ్వత పరిష్కారమన్నారు. స్థానిక సంస్థల రిజర్వేషన్ల విషయంలో మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, కర్నాటక రాష్ట్రాలలో కూడా బీసీలకు వ్యతిరేకంగా తీర్పులు వచ్చాయని అన్నారు. ఆ రాష్ట్రాలలోని బీసీలు తిరుగుబాటు చేయలేదని మన రాష్ట్ర ప్రజలు మాత్రం రాష్ట్ర బంద్ నిర్వహించి చరిత్ర సృష్టించారని అన్నారు. ఆర్టికల్ 243డి 6 ప్రకారం రిజర్వేషన్లను నిర్ణయించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందన్నారు. ఇందుకోసం అసెంబ్లీ చట్టం తీసుకురావడం జరిగిందని గుర్తు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ అంశాన్ని ప్రధాన అంశంగా తీసుకుని స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. లేనిపక్షంలో బీసీల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.భాస్కర్, కె.నరేందర్, రాజు, కరుణాకర్, టి.రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

‘కేస్ ఫర్ రామ్’ పుస్తకావిష్కరణ


కేస్ ఫర్ రామ్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జస్టిస్ నర్సింహారెడ్డి, సుబ్రహ్మణ్యం, రవికుమార్

రాంనగర్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి) : రూప పబ్లికేషన్స్ ఇండియా ఆధ్వర్యంలో అనిరుధ్ శర్మ, శ్రీధర్ పోతరాజులు రాసిన కేస్ ఫర్ రామ్ ది అన్‌టోల్డ్ ఇన్‌సైడర్స్ స్టోరీ పుస్తకావిష్కరణ శనివారం రెడ్‌హిల్స్‌లోని సూరానా ఆడిటోరియంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పూర్వ న్యాయమూర్తి ఎల్.నర్సింహారెడ్డి, ఏపీ మాజీ చీఫ్ సెక్రటరీ ఎల్.వి.సుబ్రహ్మణ్యం, ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షుడు ఆర్.రవికుమార్ తదితరులు హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. కేస్ ఫర్ రామ్ పుస్తకం ఒక అద్భుత పుస్తకం అన్నారు. ఈ పుస్తకం గురించి మాట్లాడడం సంతోషకరమైన విషయమన్నారు. రామమందిరం పట్ల అపరిమితమైన భక్తి, నమ్మకం పెట్టుకుని ఎన్నో కోర్టు కేసుల్లో గెలుచుకుని సాధించుకున్నామన్నారు. ఈ పుస్తకాన్ని ప్రతి ఒక్కరూ చదవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ పుస్తకం తమ చేతుల మీదుగా ఆవిష్కరింపజేయడం సంతోషంగా ఉందన్నారు. పుస్తక రచయితలు రామమందిరం కోసం పడిన కష్టాలను, దాని వల్ల కలిగిన ఫలితాలను ఈ పుస్తకంలో వెలువరించారని వారన్నారు. ఈ కార్యక్రమంలో సాహిత్య అభిమానులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్‌లో బీజేపీ విజయం ఖాయం


ప్రచారంలో నాగభూషణంచారి తదితరులు

ముషీరాబాద్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి) : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడం ఖాయమని ఆ పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బిజ్జి కనకేష్ కుమార్ ధీమా వ్యక్తం చేశారు. శనివారం భోలక్‌పూర్‌కు చెందిన బీజేపీ నాయకులు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న దీపక్‌రెడ్డిని బిజ్జి కనకేష్ కుమార్ ఆధ్వర్యంలో కలిసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కనకేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రధాని మోదీ చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేస్తూ పార్టీ గెలుపునకు కృషిచేస్తున్నాం అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సత్యనారాయణ, సాయి, బాబు తదితరులు పాల్గొన్నారు.

చిక్కడపల్లి : జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ నియోజకవర్గంలోని వెంగళ్‌రావునగర్ డివిజన్ కల్యాణ్‌నగర్‌లో శనివారం ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు టి.గోపాల్ ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ బీజేపీకి ఓటు వేయాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో గోపాల్‌తో పాటు వాణిశాస్త్రి, సత్యం దోనేటి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అంబర్‌పేట : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డికి మద్దతుగా అంబర్‌పేట నియోజకవర్గ నేత దాసోజు నాగభూషణంచారి తదితరులు శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ట్రావెల్ మాఫియాను ప్రోత్సహిస్తుంది ప్రభుత్వమే : ఆప్


కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న ఆప్ నాయకుడు సుధాకర్ తదితరులు

కవాడిగూడ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి) : ట్రావెల్ మాఫియాను ప్రోత్సహిస్తుంది ప్రభుత్వమేనని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ఆరోపించారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రాజీనామా చేయాలని, ప్రైవేట్ ట్రావెల్ బస్సు సర్వీస్‌లను నిషేధించాలని సుధాకర్ అన్నారు. కర్నూలు బస్సు ప్రమాదంలో ప్రయాణికులు మరణించడం పట్ల ఆయన తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శనివారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ విగ్రహం వద్ద కర్నూలు బస్సు ప్రమాద బాధితులకు కొవ్వొత్తులు వెలిగించి ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ నుంచి బెంగళూరుకు ప్రయాణిస్తున్న వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు అగ్ని ప్రమాదానికి గురై భారీ సంఖ్యలో ప్రాణనష్టం జరగడానికి కారణం రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమేనని ఆరోపించారు. ఇందుకు కారణమైన వారితోపాటు వేమూరి కావేరి ట్రావెల్స్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బస్సు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు కోటి రూపాయల నష్టపరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆప్ నాయకులు బుర్ర రాముగౌడ్, విజయ్ మల్లంగి, హేమ జిల్లోజు, జావీద్ షరీఫ్, దర్శనం రమేష్, రమ్యగౌడ్, రాకేష్‌సింగ్, ఆలీ పాల్గొన్నారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం స్వాధీనం


మహిళ మృతదేహం

కవాడిగూడ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి) : గుర్తుతెలియని ఓ మహిళ మృతదేహాన్ని గాంధీనగర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గాంధీనగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పోలీస్‌స్టేషన్ పరిధిలోని న్యూబోయగూడలోని మజీద్ ఏ క్యూబా సమీపంలోని ఫుట్‌పాత్‌పై దాదాపు 45 సంవత్సరాలు గల ఓ గుర్తుతెలియని మహిళ పడి ఉందని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న గాంధీనగర్ పోలీసులు ఫుట్‌పాత్‌పై పడి ఉన్న గుర్తుతెలియని మహిళ మృతిచెందినట్లుగా గుర్తించారు. ఆమె ఒంటిపై ఎలాంటి ఆనవాళ్లు లేకపోవడంతో అనారోగ్యంతో మృతిచెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు స్థానిక గాంధీనగర్ పోలీసులకు కానీ లేదా ఫోన్ నెంబర్ 87126 60143, లేదా 8712660145లో సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

వాచ్‌మన్ గదిలో పేలిన గ్యాస్ సిలిండర్

● పేలుడు శబ్దానికి ముక్కలైన సిలిండర్

● ప్రాణాపాయం నుంచి తప్పించుకున్న వాచ్‌మన్ సంగయ్య

● లక్ష రూపాయలకు పైగా ఆస్తి నష్టం


ఇంట్లోని వస్తువులు బూడిదైన దృశ్యం

రాంనగర్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి) : ఓ వాచ్‌మన్ నివాసం ఉంటున్న గదిలో అతడు వంట చేస్తుండగా గ్యాస్ లీకై సిలిండర్ పేలింది. ఈ ఘటనలో వాచ్‌మన్ తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకోగా దాదాపు లక్ష రూపాయల ఆస్తినష్టం జరిగింది. నల్లకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం జరిగిన సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. విద్యానగర్‌లోని 1-9-295/32/1/ఎ ఇంటి యజమాని మోహిద్‌ఖాన్ ఇంట్లో కొన్ని సంవత్సరాలుగా సంగయ్య(70) వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. అతడు శనివారం ఉదయం తన గదిలో వంట చేసేందుకు స్టవ్ ముట్టించాడు. దీంతో గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. దీంతో అతడు ఆ గది నుంచి పరుగులుపెట్టి మంటల నుంచి తప్పించుకున్నాడు. అయితే గ్యాస్ లీకై మంటలు అంటుకుని అతని ఇంట్లోని వస్తువులన్నీ కాలి బూడిదయ్యాయి. కొద్ది క్షణాల్లోనే సిలిండర్ పేలి ముక్కలైంది. పేలుడు శబ్దంతో ఇంట్లోని గోడలు దెబ్బతిన్నాయి. ఒక్కసారిగా భారీ శబ్దం రావడంతో స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వెంటనే విషయం తెలుసుకున్న ఇంటి యజమాని మోహిద్‌ఖాన్ నల్లకుంట పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఎస్‌ఐ వరలక్ష్మి అక్కడికి చేరుకుని మంటలను ఆర్పించారు. ప్రమాద విషయాన్ని యజమాని ముషీరాబాద్ తహసీల్దార్ రాణాప్రతాప్‌సింగ్‌కు ఫిర్యాదు చేయగా వెంటనే ఆర్‌ఐ ఉపేందర్, అసిస్టెంట్ శేఖర్ అక్కడికి చేరుకుని జరిగిన ప్రమాదంపై పంచనామా చేశారు. బాధితుడికి జరిగిన నష్టపరిహారం అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ ఘటనా స్థలాన్ని బీఆర్ఎస్ అడిక్‌మెట్ డివిజన్ ప్రధాన కార్యదర్శి కె.సురేందర్, నగర నాయకులు, కాంగ్రెస్ నాయకులు అక్కడికి చేరుకుని బాధితుడికి తగిన నష్టపరిహారం అందించాలని రెవెన్యూ అధికారులను కోరారు. నల్లకుంట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇండేన్ గ్యాస్ అధికారి, సిబ్బంది ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేపట్టారు.

విద్యాసంవత్సరం మధ్యలో పాఠశాలను ఖాళీ చేయమంటే ఎలా?

● హైకోర్టు ప్రశ్న ● సివిల్ కోర్టు ఉత్తర్వులపై స్టే

● ముషీరాబాద్ రేడియంట్ స్కూల్‌కు ఊరట

హైదరాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యాసంవత్సరం మధ్యలో పాఠశాలను ఖాళీ చేయాలని ఆదేశిస్తే అందులో చదువుతున్న విద్యార్థుల భవిష్యత్తు ఏమిటని హైకోర్టు ప్రశ్నించింది. ముషీరాబాద్‌లోని రేడియంట్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు సమర్పించిన వినతిపత్రంపై తగిన చర్యలు తీసుకోవడంలో పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విఫలమయ్యారని అభిప్రాయపడింది. ఓ సివిల్ వివాదంలో ముషీరాబాద్ రేడియంట్ పాఠశాలను ఖాళీ చేయాలని సిటీసివిల్ కోర్టు ఉత్తర్వులు జారీచేసింది. విద్యా సంవత్సరం మధ్యలో ఇలా చేయడం తగదంటూ జస్టిస్ సూరేపల్లి నంద ధర్మాసనం స్టే విధించింది. తదుపరి విచారణ నవంబర్ 11కు వాయిదా పడింది.

కృష్ణా వాటర్ పైప్‌లైన్ మరమ్మతులు పూర్తి

రాంనగర్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి) : కృష్ణా వాటర్ పైప్ లైన్ మరమ్మతులు పూర్తయ్యాయని, దీంతో నారాయణగూడ సబ్ డివిజన్ పరిధిలోని ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాలలోని జలమండలి సబ్ డివిజన్ల పరిధిలో తాగునీటి సరఫరాలో నెలకొన్న అంతరాయ సమస్య పరిష్కారమైందని జలమండలి నారాయణగూడ డివిజన్ జీఎం శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఈ పైప్‌లైన్ మరమ్మతు వల్ల ప్రజలకు తాగునీటిలో ఇబ్బంది పరిష్కరించడం కోసం ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేశామన్నారు. సప్లై జరగకపోవడంతో వాటర్ ట్యాంకర్లకు డిమాండ్ పెరిగిందన్నారు. ప్రస్తుతం నీటి సరఫరా పునరుద్ధరణతో తాగునీటి సమస్య పరిష్కారమైందన్నారు. సబ్ డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యను డీజీఎం, మేనేజర్లు తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారని ఆయన తెలిపారు.

హరిహరుల మహాకోటి దీపోత్సవం

● ఈనెల 30 నుంచి నవంబర్ 20వ తేదీ వరకు


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సంస్కృతి నిర్మాణ్ ట్రస్ట్ ప్రతినిధులు

నల్లకుంట, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి) : సంస్కృతి నిర్మాణ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 30 నుంచి నవంబర్ 20వ తేదీ వరకు హరిహరుల మహాకోటి దీపోత్సవం నిర్వహించనున్నట్లు ట్రస్ట్ ప్రతినిధులు వెల్లడించారు. ఈ హరిహరుల మహాకోటి దీపోత్సవంలో ప్రతి రోజు నాదస్వరం, గణపతిపూజ, హరిహరులపూజ, భక్తులచే సామూహిక లలిత, విష్ణు సహస్రనామ పారాయణములు, ప్రవచనాలు, శివకేశవుల కల్యాణం, ప్రతినిత్యం ప్రదోషకాలంలో గురువుచే విశేష ద్రవ్యములచే మహారుద్రాభిషేకం కార్యక్రమాలు జరుగుతాయని వారన్నారు. శనివారం హైదర్‌గూడలోని ఎన్‌ఎస్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంస్కృతి నిర్మాణ్ ట్రస్టీ ఫౌండర్ దోర్బాల గుణాకర్‌శర్మ, ట్రస్టీలు సదానంద్‌శర్మ, వినయ్‌కుమార్, శ్రీధర్, ప్రశాంత్, ప్రవీణ్‌పన్నాల, నాగేందర్‌సింగ్ తదితరులు హరిహరుల కోటి దీపోత్సవం బ్రోచర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కార్తీకమాసంలో భాగంగా పటాన్‌చెరువు వాల్యూజోన్ హైపర్ మార్ట్ ఎదురుగా ఓఆర్ఆర్ ఎగ్జిట్ గేట్ నెంబర్ 3 వద్ద 21 రోజుల పాటు ఈ హరిహరుల మహాకోటి దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ దీపోత్సవంలో సంగారెడ్డి కలెక్టర్, జిల్లా ఎస్పీ, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని వారన్నారు.

రైల్లో ప్రయాణికురాలి హ్యాండ్‌బ్యాగ్ చోరీ

● గోల్డ్‌చైన్, 14వేల నగదు తస్కరించిన దొంగలు

బర్కత్‌పుర అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రైల్లో ప్రయాణిస్తున్న మహిళ మెడలోని బంగారు గొలుసుతో పాటు కొంత నగదును దొంగలు తస్కరించారు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ జిల్లాకు చెందిన సురేష్‌కుమార్ భార్య దేవి శనివారం విశాఖ-మహబూబ్‌నగర్ ఎక్స్‌ప్రెస్‌లో కాచిగూడకు వస్తుండగా, మహబూబాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలో ఆమె చేతిలోని హ్యాండ్ బ్యాగును గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. ఆ బ్యాగులో 9 గ్రాముల బంగారు గొలుసు, రూ.14వేల నగదు ఉందని బాధితురాలు దేవి శనివారం రాత్రి కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న కాచిగూడ రైల్వే పోలీసులు తదుపరి విచారణ నిమిత్తం ఈ కేసును డోర్నకల్ రైల్వే పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేసినట్లు తెలిపారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

బర్కత్‌పుర, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి) : పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. బుద్వేల్-ఫలక్‌నామా రైల్వేస్టేషన్ల నడుమ శనివారం ఉదయం 55 సంవత్సరాలు గల గుర్తు తెలియని వ్యక్తి పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని తీవ్ర గాయాలయ్యాయి. అతడిని ఆస్పత్రికి చేర్పించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.